విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి కనబర్చాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు జ్ఞానతృష్ణతో నిత్య నూతన ఉత్తేజంతో ఆవిష్కరణలవైపు ఆసక్తి కనబర్చాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం ఎంజీయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నూతన ఆవిష్కరణలకు అధ్యయనం, పరిశీలన, స్పృహ అవసరం అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డా. చల్లా సురేశ్ మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, పని విధానం, సమాజ పోకడలు అనేక జీవక్రియ రుగ్మతలకు ప్రధాన కారణాలుగా పరిశోధనల్లో తేలిందని తెలిపారు. వీటిని ఎదుర్కొనేందుకు ఆంటాక్సిడెంట్స్ విటమిన్స్, ప్రోబయోటిక్స్‌పై అధ్యయనాల అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ కె.అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, శివరాం, మాధురి, రామ్‌చందర్ గౌడ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన గుడిపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులు, ల్యాబ్‌లో మలేరియా, డెంగీ నిర్ధారణకు సేకరించిన నమూనాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులపట్ల క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, స్థానిక వైద్యాధికారి ప్రియాంక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెంచితే.. మంచిదే

★ హాస్టళ్ల మెస్, కాస్మెటిక్ ఛార్జీలపై ప్రభుత్వ నిర్ణయమే తరువాయి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

నిరుపేద విద్యార్థులకు పోషకాహారం, ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సంక్షేమ హాస్టళ్లకు మెస్ ఛార్జీలు పెంచాలంటూ ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వానికి నివేదించగా.. 15 ఏళ్ల నుంచి విద్యార్థుల ఎదురు చూపులకు మోక్షం కలుగనుంది. ఈ నెల 21న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా 40 శాతం పెంచాల్సిన అవసరం ఉందంటూ ఉన్నతాధికారుల కమిటీ నివేదించింది. దీంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎంతో ఆశగా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచితే పోషకాహారం అందించవచ్చని విద్యార్థి సంఘాలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు


★ గురుకుల పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 540 మంది విద్యార్థులు చదువుతుండగా, కళాశాల ఉన్న గురుకులాల్లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల మంది విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపుతో ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లు..

జిల్లా	ఎస్టీ	ఎస్సీ	బీసీ	గురుకులాలు	కేజీబీవీ
నల్గొండ	43	60	37	55	27
సూర్యాపేట	20	36	24	42	18
యాదాద్రి	6	21	21	12	9

ఉన్నతాధికారుల కమిటీ డైట్ ఛార్జీ సిఫార్సులు..

తరగతి	ప్రస్తుతం (రూ.లలో)	నివేదించినది (రూ.లలో)
3–7 తరగతులు	950	1,330
8–10 తరగతి వరకు	1,100	1,540
ఇంటర్–పీజీ	1,500	2,100





పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలి..

– కమ్మంపాటి శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మార్కెట్‌లో వస్తుసామగ్రి ధరలు 15 ఏళ్ల క్రితం కంటే పదిరెట్లు పెరిగాయి. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులకు రూ. 2వేలు, కళాశాల విద్యార్థులకు రూ.3వేలు పెంచాలి, కాస్మెటిక్ ఛార్జీలు విద్యార్థినులకు రూ.500, విద్యార్థులకు కనీసం రూ.300 ఇవ్వాలి.

వార్డు అధికారులొచ్చేశారు

❑ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతానికి నియామకం

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర పురపాలక శాఖ చర్యలు తీసుకుంటోంది. వేలల్లో దరఖాస్తులు రావడం, తక్కువ మంది సిబ్బంది ఉండటంతో పరిష్కారానికి కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించగా.. రాష్ట్ర పురపాలక శాఖ క్షేత్రస్థాయిలో వార్డు అధికారులను నియమించాలని ఆదేశాలు జారీచేసింది. వార్డు అధికారుల నియామకంతో దరఖాస్తుల పరిష్కారం వేగంగా సాగుతోంది.



సూర్యాపేటలో క్షేత్రస్థాయిలో ప్లాటు దరఖాస్తును పరిశీలిస్తున్న వార్డు అధికారులు

19 పురపాలికల్లో 175 మంది

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. 1,93,773 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. 2020లో దరఖాస్తులు చేసుకున్నారు. అవి పురపాలిక పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల లాగిన్‌లో ఉంటాయి. ఎల్ఆర్ఎస్-2020 యాప్ ద్వారా వీరు తొలిదశలో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు దశల్లో అధికారుల పరిశీలన కార్యాలయాల్లోనే సాగుతుంది. వేలల్లో దరఖాస్తులు ఉండటం, పైగా అర్జీ పెట్టుకున్న వారి చిరునామాలు గుర్తించటం, స్థలాల హద్దులు నిర్ధారించడంలో ఇబ్బందులున్నాయి. ఈ క్రమంలో పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేవలం మూడు బృందాలు పని చేస్తుండటంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. పురపాలక శాఖ వార్డు అధికారులను నియమించాలని సూచించడంతో పుర అధికారులు ఆ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 175 మంది వార్డు అధికారులను నియమించారు. వీరు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలన చేస్తున్నారు.

ఒక్కొక్కరికి 1100 దరఖాస్తులు


పురపాలికలో ఒక్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉంచకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో అధికారికి 1100 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో పట్టణ పేదరిక నిర్మూలన, మున్సిపల్ వైద్యారోగ్య విభాగాల సిబ్బందిని భాగస్వాములను చేశారు. ఈ మేరకు తనిఖీ బృందాలు పెరగడంతో లక్ష్యం పూర్తయ్యే అవకాశం ఉందని పుర అధికారులు చెబుతున్నారు.

జిల్లా	పురపాలికలు	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు	వార్డు అధికారులు
సూర్యాపేట	5	65,769	59
నల్గొండ	8	72,642	66
యాదాద్రి	6	55,362	50

విద్యార్థి గుర్తింపు.. అపార్

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, మునగాల, న్యూస్‌టుడే:

ఆధార్‌కార్డు తరహాలో విద్యార్థి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు ఈ కార్డు ఇస్తారు. దీన్నే అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు అంటారు. దేశవ్యాప్తంగా ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కేటాయించే గుర్తింపు కార్డు ఇది. రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో అన్ని పాఠశాలల్లో, ఇతర విద్యాసంస్థలలో ఈ ప్రక్రియ మొదలైంది.



అపార్ నమూనా కార్డు

పొందుపర్చే వివరాలు:

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ప్రయోజనాలు..

అపార్ గుర్తింపు వల్ల డిజీలాకర్‌కు అనుసంధానం అవుతారు. దీంతో అన్ని ధ్రువీకరణ పత్రాలను విద్యార్థి సురక్షితంగా భద్రపర్చుకోవచ్చు. పాఠశాల మారినా ఇబ్బంది ఉండదు. విద్యార్థులు పొందుతున్న ఉపకార వేతనాలు, ఇతర ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయంలో, ఇతర అంశాల్లో అపార్ కార్డు ఆధారంగా సమాచారం తీసుకునేలా రూపొందిస్తారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,631 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా.. అందులో దాదాపు 3.85 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో 220 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో దాదాపు 4 వేల మంది చదువుకుంటున్నారు. వీరు కాక డిగ్రీ, పీజీ కళాశాలల్లో మరో 3 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న దాని ప్రకారం పాఠశాలల్లో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. కేంద్రం ఆపార్ కార్డు ద్వారా కేటాయించే క్యూఆర్ కోడ్ సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో ప్రతి విద్యార్థికి సంబంధించిన కేజీ టు పీజీ పూర్తి వివరాలు, సాధించిన విజయాలు, పొందిన ఉపకార వేతనాలు, మెమోలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసంధానమై ఉండటంతో కుటుంబ వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి.

అనుమతి తప్పనిసరి..

అపార్ గుర్తింపు కార్డు కోసం విద్యార్థి, విద్యార్థి వివరాలు తీసుకుంటున్నందున తప్పనిసరిగా ఆ విద్యార్థి తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అపార్ కార్డు కోసం ఎలా నమోదు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై రాష్ట్ర అధికారులు ప్రధానోపాధ్యాయులకు జూమ్ మీటింగ్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో అపార్ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు.

అవగాహన కల్పించి నమోదు చేస్తున్నారు:

అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి, సూర్యాపేట

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అపార్ కార్డు కోసం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివరాలు తెలియచేసి వారి అనుమతి తీసుకొని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. దీనికి చివరి తేదీ అనేది లేదు.

దూది పూలు.. దళారుల పాలు

ఉమ్మడి జిల్లాలో పత్తి ఎక్కువగా సాగవుతోంది. కొద్దిరోజుల వరకు మద్దతు ధర కంటే అధికంగా రూ.8 వేలు పలికిన పత్తి.. ఒక్కసారిగా దిగి వస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 7,18,765 ఎకరాల్లో పత్తి సాగైంది. గతేడాది కన్నా 60 వేల ఎకరాల్లో తక్కువగా పండించారు. దిగుబడి ఇప్పుడిప్పుడే చేతికివస్తోంది. ఈసారి భారీ వర్షాల వల్ల పత్తి పూత, పిందె సమయంలో కొంత దెబ్బతింది. దిగుబడి కూడా ఆశించిన మేర వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

– నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:



పెద్ద సూరారంలో రైతుల ఇంటి వద్ద పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

తక్కువ ధరకు కొనుగోలు

కొద్దిరోజుల క్రితం క్వింటాకు రూ.8 వేలు పలికిన పత్తి ధర క్రమంగా తగ్గుతూ వస్తోంది. సీసీఐకి వెళ్దామంటే తేమ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో రూ.5,500 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తేమ, చెత్త, నల్లగా ఉందని ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దిగుబడులు 65 లక్షల క్వింటాళ్ల వరకు ఉండొచ్చనే అంచనాలున్నాయి. ఎకరాకు సగటున ఎనిమిది నుంచి 14 క్వింటాళ్ల వరకు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. క్వింటాకు రూ.1,500 రూ.2 వేల వరకు ధర తగ్గినా రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లనుంది.

తేమ పేరు కొర్రీలు

పత్తి కొనుగోలుకు ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల వద్ద ఇంకా విక్రయాలు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 30 వరకు ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తేమ పేరుతో నిర్వాహకులు తీసుకోకపోవడం దళారులకు వరంగా మారింది. ప్రతి గ్రామంలో దళారులు పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ ఇస్తామని రైతులను నమ్మించి.. తూకాల్లో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందని వ్యాపారి తప్పుడు తూకంతో మోసం చేస్తే రైతులు పట్టుకున్నారు. గ్రామాల్లో తూకం వేస్తున్న కాంటాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి, దోపిడీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

సాయంత్రం లోపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి: కలెక్టర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతిపాదించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నేడు(బుధవారం) సాయంత్రంలోపు ప్రారంభించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 375 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రతిపాదించామని చెప్పారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సామాజిక ఆర్థిక గణనలో గణకులను, పర్యవేక్షకులను తక్షణమే గుర్తించాలన్నారు. ఉపాధ్యాయులను ఈ సర్వే విధులకు తీసుకోవద్దన్నారు. మండల ప్రత్యేకాధికారులు సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నందున.. పెండింగ్‌లో ఉన్న 14వేల వరకు దరఖాస్తులను 26లోపు పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.



కలెక్టర్ సి.నారాయణరెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం


నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న ఐదు కేజీబీవీలలో అకౌంటెంట్ (కాంట్రాక్టు ప్రాతిపదికన), రెండు కేజీబీవీల్లో ఏఎన్ఎం(ఔట్‌సోర్సింగ్ పద్ధతిన) జిల్లా స్థాయి కమిటీ ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 44 సంవత్సరాలలోపు వారు అర్హులని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేళ్ల వయసు సడలింపు ఉందన్నారు. అకౌంటెంట్ పోస్టుకు బీకాం డిగ్రీ, కంప్యూటర్ నైపుణ్యం కలిగిన ధ్రువీకరణ పత్రం లేదా డిగ్రీ నందు బీకాం(కంప్యూటర్స్) ఉండాలని తెలిపారు. ఎంకాం అభ్యర్థులకు వెయిటేజ్ ఉందని పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్, ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల నందు ఎఎన్ఎం శిక్షణ పొంది ఉండాలని తెలిపారు. నల్గొండ జిల్లా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తులను డీఈవో నల్గొండ.బ్లాగ్‌స్పాట్.కామ్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

నల్గొండ అర్బన్: ఈఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి ఎయిడెడ్ ప్రైవేటు ఎంపీహెచ్ డబ్ల్యూ (మహిళా) ఏఎన్ఎం రెండేళ్ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

నల్గొండ విద్యావిభాగం: బెస్ట్ అవెలబుల్ పథకం కింద డ్రాప్ అవుట్ అయిన 17 గిరిజన విద్యార్థుల ఖాళీలను భర్తీ చేసేందుకు జిల్లాలోని గిరిజన(ఎస్టీ) ఉపకులాల వారి నుంచి ఈనెల 26 లోపు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం సీట్లలో 33శాతం బాలికలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. 4వ తరగతిలో(2), 6వ తరగతిలో(8), 7వ తరగతిలో (2), 9వ తరగతిలో(5) సీట్లు ఉన్నాయని వివరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ప్రస్తుత పాఠశాల బోనాఫైడ్ ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 95151 81080, 08682-295715 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాదదారి లేక.. తికమక





రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

వాహనాల మధ్య రోడ్డు దాటుతున్న విద్యార్థులు

నల్గొండ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇది మిగతా వాహనాలకు ఇబ్బందిగా మారింది. మలుపుల వద్ద రోడ్డు ఆక్రమించి శాశ్వత డబ్బాలు ఏర్పాటు చేసి పలువురు వ్యాపారాలు సాగిస్తున్నారు. నల్గొండ పట్టణంలో ప్రధాన రోడ్లపై ఉన్న పాఠశాలల వద్ద సైతం ట్రాఫిక్‌ను నియంత్రించడం లేదు. ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. దీంతో విద్యార్థులు ప్రమాదరకంగా రోడ్డును దాటుతున్నారు.

– ఈనాడు, నల్గొండ

ఆరుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: బదిలీల్లో తప్పుడు స్పౌజ్‌ను వినియోగించిన ఆరుగురు ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీగా ఉన్న పాఠశాలలకు కాకుండా అనుకూలమైన ఇతర ప్రాంతాలను ఆప్షన్‌లో ఇచ్చి దుర్వినియోగం చేశారు. కనగల్ మండలం చర్లగౌరారం ఎంపీపీఎస్‌కు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు జె.శ్రీరాములు, తిప్పర్తి మండలం జి.ప. బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఏ.రజిత, కేశరాజుపల్లికి చెందిన స్కూల్ అసిస్టెంట్ జి.సులోచన, చిట్యాల మండలం గుండ్రాంపల్లి జి.ప.ఉ.పా.కు చెందిన స్కూల్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, నల్గొండ మండలం దోమలపల్లి జి.ప.ఉ.పా.కు చెందిన స్కూల్ అసిస్టెంట్ పి.శ్రీనివాస్, మిర్యాలగూడలోని జి.ప.ఉ.పా. బకల్‌వాడికి చెందిన స్కూల్ అసిస్టెంట్ పి.స్వాతిలను విధుల నుంచి తొలగించారు.

యాదాద్రి క్షేత్రంలో.. వ్రతం టికెట్ ధర పెంచే యోచన?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి నారసింహుడి క్షేత్రంలో శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం మొక్కు తీర్చుకునే ఆర్జిత భక్తులపై ఆర్థిక భారం పడనుందా అంటే.. టికెట్ ధర పెంచాలన్న సంబంధిత అధికారుల ప్రతిపాదన నిజమనే చెబుతోంది. ప్రస్తుతం వ్రతం టికెట్ ధర రూ.800 నుంచి రూ.1000కి పెంచాలన్నదే ఆలయ అధికారుల యోచన. ఖరీదు చేసిన టికెట్‌పై పీట ఏర్పాటుతో సహా పూజా సామగ్రిని దేవస్థానం అందజేస్తోంది. దేవస్థానం ఆర్థిక భారం తగ్గించుకునే యత్నంలో భాగంగా పూజ టికెట్ ధరను పెంచే దిశగా ఆలోచిస్తున్న విషయం నిజమేనని ఆలయ ఈవో భాస్కర్‌రావు 'న్యూస్‌టుడే'తో అన్నారు. ధర పెంచే యోచనలో వ్రతం జరిపించుకున్న దంపతులకు శ్రీస్వామి వారి ఉత్తరీయం, కనుమ అందజేయాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనకు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి వస్తే ధర పెంపునకు అవకాశం ఉంటుందని ఈవో పేర్కొన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎరువుల వివరాలను తప్పనిసరిగా ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కుర్మేడ్‌లోని ఎరువుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను మాత్రమే డీలర్లు విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి పోలిశెట్టి శ్రావణకుమారి తదితరులు ఉన్నారు.

చండూరు: పత్తి సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ రైతులకు సూచించారు. చండూరు మండల పరిధిలోని చామలపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి రేవతితో కలిసి పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. మండల వ్యవసాయ అధికారిణి రేవతి, వ్యవసాయ విస్తరణ అధికారిణి శోభారాణి ఉన్నారు.

ఏకరూపం... పంపిణీకి సిద్ధం


పంపిణీకి సిద్ధంగా ఉన్న దుస్తులు

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, చింతలపాలెం, న్యూస్‌టుడే:

అంగన్‌వాడీ చిన్నారులకూ రాష్ట్ర ప్రభుత్వం ఏకరూప దుస్తులు ఇచ్చేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వివిధ డిజైన్లను ఎంపిక చేసి మహిళా సంఘాల వారితో కుట్టించే కార్యక్రమం పూర్తి కావొచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు ఏకరూప దుస్తుల్లో కనిపించేవారు. ఇక నుంచి అంగన్‌వాడీ విద్యార్థులూ ఏకరూప దుస్తులతో అంగన్‌వాడీ కేంద్రాలకు రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వస్త్రాన్ని ఎంపిక చేసి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు అందజేసింది. వారు మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చి దుస్తులు కుట్టిస్తున్నారు. వీటిని కొద్ది రోజుల్లోనే పిల్లలకు పంపిణీ చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలందరికీ కాకుండా మూడు నుంచి ఆరు సంవత్సరాల వారికి ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు.

ప్రాథమిక విద్యా కేంద్రాలుగా..

అంగన్‌వాడీ కేంద్రాలను పిండి బడులుగా కాకుండా ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్రాల బలోపేతానికి ఇప్పటికే సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం పౌష్టికాహారం అందిస్తూనే వయసును బట్టి పిల్లలకు విద్యనందిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. వీరికి త్వరలో ఏకరూప దుస్తులూ అందించనున్నారు. ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలు చదివి వినిపించడం, తదితర విద్యా కార్యక్రమాలను కూడా నిరంతరం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
అంగన్‌వాడీ ప్రాజెక్టులు	09	05	04
కేంద్రాలు	2,093	1,209	901
విద్యార్థుల సంఖ్య	29,283	14,426	18,432

కుట్టు పనులు పూర్తయ్యాయి

– నరసింహారావు, డీడబ్ల్యూవో, సూర్యాపేట

అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి కుట్టు పనులు పూర్తి చేశాం. సిద్ధంగా ఉన్న వస్త్రాలను ఆయా ఆయా కేంద్రాలకు పంపించి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం.



నల్గొండ జిల్లాలోని జలాశయాలు పూర్తిగా నిండాయి.పైగా సాగర్ కాలువల ద్వారా జిల్లాలోని గ్రామ చెరువులను నింపారు. దీంతో చెరువులు జలకళతో అందంగా కనిపిస్తున్నాయి. ముషంపల్లి గ్రామ చెరువు కూడా అలా నీటితో నిండింది. పైగా మేఘాలు వచ్చి చెరువులో వాలినట్లు కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – ఈనాడు, నల్గొండ

ప్రీతమ్..ఆలోచనలు అద్భుతం

నిడమనూరు, న్యూస్‌టుడే:


తాను గెలుచుకున్న ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో ప్రీతమ్‌కుమార్

రానున్న రోజుల్లో ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ(ఏఐ)పై ఆధారపడటంతో పాటు ఏఐను చాలా చోట్ల వినియోగిస్తున్నారని.. అందుకు తగ్గట్లు నూతన ఔత్సాహికులకు ప్రభుత్వం అండగా ఉంటే నూతన ఆవిష్కరణలు చేయడానికి వీలవుతుందని అంటున్నాడు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన పొదిళ్ల ప్రీతమ్‌కుమార్. పాఠశాలల్లో చదువుకునేటప్పుడే రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహించే విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని వివిధ అంశాలపై.. నూతన ఆవిష్కరణలతో మొదటిస్థానం సంపాదించి అమెరికా, సింగపూర్‌లలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు.

మూడు సార్లు అంతర్జాతీయ పోటీలకు..

గ్రామానికి చెందిన న్యాయవాది పొదిళ్ల శ్రీనివాస్, అనిత దంపతుల కుమారుడు పొదిళ్ల ప్రీతమ్‌కుమార్ త్రిపురారంలోని ఆల్ఫా పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తిచేశాడు. 2016 ఐఐటీ దిల్లీ క్యాంపస్‌లో రోబోట్రిక్స్ట్ సంస్థ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ ఉపయోగించుకునే అంశంపై విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి పోటీపడిన ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థుల కంటే ప్రీతమ్‌కుమార్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి 'వాటర్‌రాకెట్' అంశంపై జాతీయ స్థాయి మొదటి బహుమతి సాధించి.. ఆ సంస్థ సింగపూర్‌లో నిర్వహించే పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు. అప్పుడు ప్రీతమ్ మూడో తరగతి చదువుతున్నాడు. ఆర్థిక కారణాలతో ఆ సమయంలో అక్కడికి వెళ్లలేకపోయాడు.

◆ 2017లో ఐఐటీ హైదరాబాద్‌లో నావో టెక్ సంస్థ ఏర్పాటు చేసిన పోటీల్లో స్వచ్ఛభారత్ అంశాన్ని ఎంచుకుని 'చెత్తను శుభ్రపరిచే రోబో'ను తయారుచేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానం సంపాదించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అమెరికాకు ఎంపికయ్యాడు. 2019లో ఆరో తరగతిలో పుణెలో నిర్వహించిన మరో విజ్ఞాన ప్రదర్శనలో 'అగ్నిప్రమాదాలను పసిగట్టే సెన్సార్‌బోట్'ను తయారుచేసి మరోసారి అమెరికాకు వెళ్లేందుకు ఎంపికయ్యాడు. ఈ రెండు సార్లు ఆర్థిక కారణాలతో పోటీలకు హాజరుకాలేకపోయాడు.

◆ ఇప్పటి వరకు పదికి పైగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అన్నింట్లో మొదటి బహుమతులతో పాటు 20 వరకు ప్రశంసాపత్రాలు, 15 వరకు బంగారు, వెండి పతకాలు, జ్ఞాపికలను కైవసం చేసుకున్నాడు.

◆ 'నాకు బలమైన ఆర్థిక వనరులు లేక గతంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయాను, ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోకరాజుగంగరాజు కళాశాలలో సీఎస్ఈ విభాగంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా'నని ప్రీతమ్ తెలిపాడు.

అన్నదాత ఆగమాగం

ఈనాడు, నల్గొండ – నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చౌటుప్పల్, చిట్యాల, మిర్యాలగూడ, నకిరేకల్, నిడమనూరు, వేములపల్లి, హాలియాలో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షార్పణమైంది. చౌటుప్పల్, చిట్యాల లాంటి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు.

❒ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలుండగా.. ప్రస్తుతం 50 శాతం కేంద్రాల్లోనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడుతుంది.

❒ ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా 7,18,765 ఎకరాల్లో పత్తి సాగవ్వగా 65 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి ఏరే సమయంతో పాటు చేల మీద ఉన్న పత్తి తడవడంతో రంగు మారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిన్నింగ్ వ్యాపారులు సైతం పత్తి నాణ్యత లేదనే సాకుతో అరకొర ధరకు కొనుగోలు చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు తగ్గడంతో ఎన్నెస్పీ అధికారులు రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 71,361 క్యూసెక్కుల వరదనీరు రాగా సాగర్ డ్యాం నుంచి 2 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 15,948 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమ కాల్వలు, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 64,518 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 588.80 అడుగులు కాగా ఇది 308.4658 టీఎంసీలకు సమానం.

జలసేద్యం.. ఆరోగ్య భాగ్యం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:


జలసేద్యం పద్ధతిలో సాగవుతున్న ఆకుకూరలు

అతనో సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ వరకు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో తమకున్న భూమిలో పలు రకాల పంటలు సాగిస్తున్నాడు. అందరిలా కాకుండా.. వినూత్నంగా, ఆరోగ్యకరంగా ఆకుకూరలు పండించాలని సంకల్పించి.. ఇది వరకే సాగు చేస్తున్న వారి సలహాలతో జలసేద్యాన్ని ప్రారంభించాడు. ఇటీవలే పంట వినియోగానికి సైతం వచ్చింది. మిర్యాలగూడ పట్టణంలో జల సేద్య విధానంలో పంటలను సాగు చేస్తున్న ఆ రైతు తన అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

వాతావరణాన్ని నియంత్రిస్తూ..

జలసేద్యం కోసం మిర్యాలగూడలోని బైపాస్ రహదారి పక్కన పది గుంటల స్థలంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేకంగా పాలీ హౌస్ ఏర్పాటు చేశాను. వీటి ప్రత్యేకత ఏంటంటే కాలమేదైనా వాతావరణం మారకుండా చూసుకుంటాయి. దీంట్లో భాగంగా తొలుత ఆకుకూరల విత్తనాలను చిన్న చిన్న ట్రేలలో కోకోపిట్(కొబ్బరి పీచు పొడి)లో 15 రోజుల పాటు ఉంచుతాం. అనంతరం ఆ మొక్కలను పైపు ఛాంబర్లలోకి మార్చుతాం. ఇందులో ఎటువంటి మట్టి, కోకోపిట్ ఉండదు. వీటికి పైపుల ద్వారానే కావాల్సిన పోషకాలు అందిస్తాం. మొత్తం మూసి ఉంచడం వల్ల ఎటువంటి పురుగులు, దోమలు లోపలికి రావు.

యూట్యూబ్‌లో చూసి..

నా పేరు పడిగపాటి వెంకట్‌రెడ్డి. మాది దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం. నాకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. దీంతో కొన్నేళ్లుగా వ్యవసాయంలో వినూత్న పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నాను. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆకుకూరలు అందించాలనే లక్ష్యంతో అన్వేషిస్తుండగా.. యూట్యూబ్‌లో హన్మకొండకు చెందిన రవికిరణ్‌రెడ్డి వీడియోలు చూసి వారి సలహాలతో జలసేద్య పద్ధతిలో ఆకుకూరలు సాగు చేయడం ప్రారంభించాను. మరీ అవసరమైతే వేప నూనె మాత్రం కొడతాం. నిరంతరం 30డిగ్రీల సెల్సియస్ లోపు ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

వృథా ఉండదు..

సాధారణ పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో అధిక శాతం వృథాగా పోతుంది. జలసేద్య పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో ఎటువంటి వృథా ఉండకపోగా.. కాడలు సైతం తినొచ్చు. ఆరోగ్యంతో పాటు రుచిలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పాలకూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, చెర్రీ టమాట వంటి పంటలు సాగు చేస్తున్నాం.

త్వరలో ఆన్‌లైన్‌లో అమ్మకాలు...

ప్రస్తుతం మేము ఇటీవలే ప్రారంభించిన హోటల్ విహార్‌లో ఈ ఆకుకూరలు, కూరగాయలు వినియోగిస్తున్నాం. దీంతో పాటు ఇక్కడికి వచ్చిన వినియోగదారులకు సైతం ఆకుకూరలు విక్రయిస్తున్నాం. ప్రతి 25 రోజులకోసారి పంట వస్తుంది. త్వరలోనే ఆన్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభించి.. డోర్ డెలివరీ సైతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

వ్యవసాయ ఇంట.. కొలువుల పంట

మునుగోడు, న్యూస్‌టుడే: నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని.. పక్కా ప్రణాళికతో.. సమయాన్ని వృథా చేయకుండా పట్టుదలతో చదివితే సాధించలేని విజయాలంటూ లేవని నిరూపించారు ఆ యువకుడు. కుమారుడు ఉన్నత స్థానంలో నిలవాలని రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. నిరుపేద కారణంగా ఆర్థిక సమస్యలు ఎదురైనా.. ఇంట్లో సర్కారు కొలువుల పంట పండించి వెలుగులు నింపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టతరమైన ఈ రోజుల్లో ఏకంగా నాలుగు కొలువులు కొట్టి అందరి ప్రశంసలందుకుంటున్నారు.. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన సురేష్.

రోజూ పది గంటల సాధన


తల్లిదండ్రులు మదనబోయిన వెంకటేశం-సత్తమ్మలతో కుమారుడు సురేష్

మదనబోయిన వెంకటేశం-సత్తమ్మ దంపతుల రెండో కుమారుడు సురేష్.. ఓయూలో 2016లో బీఈ(బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్) పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా హైదరాబాద్‌లో అద్దె ఇంట్లో ఉంటూ నిత్యం పది గంటలపాటు సాధన చేశారు. ఆ పట్టుదలతోనే 2023లో తొలి ప్రయత్నంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ)లో రైల్వే మేనేజర్ ఉద్యోగం సాధించారు. అనంతరం వరసగా 2024 జూన్‌లో నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), ఆగస్టులో టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్, టీజీపీఎస్సీ గ్రూప్-4కు సైతం ఎంపికయ్యారు. వీటిలో ఏఈఈ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని సెప్టెంబరు 30న సూర్యాపేట డివిజన్ పరిధిలోని మోతె సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు సైతం స్వీకరించారు. 'అమ్మానాన్నల సహకారంతో కష్టపడి చదువుకున్నా. పట్టుదలతో సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించా. గ్రూప్-1 సాధించాలనే లక్ష్యంతో ఖాళీ సమయంలో కసరత్తు చేస్తున్నా'నని సురేష్ పేర్కొన్నారు.


నాసిరకం సింథటిక్ రంగులతో చిరుతిండి తయారీ

◆ తయారీదారుడిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: నాసిరకం సింథటిక్ రంగులను వినియోగిస్తూ చెకోడీలు, మిక్చర్, చిరుతిండి పదార్థాలు తయారు చేసి, సరఫరా చేస్తున్న వ్యక్తిని మంగళవారం యాదగిరిగుట్టలో ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. యాదగిరిగుట్ట ఠాణా సీఐ రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన చిన్న ఆనంద్ అనే వ్యక్తి చిరుతిండి పదార్థాలు తయారు చేస్తూ దుకాణాలకు, శుభకార్యాలు, వివిధ ఆర్డర్లపై సరఫరా చేస్తుంటాడు. ఈ పదార్థాలలో నాసిరకం సింథటిక్ రంగులు వాడుతున్నాడనే సమాచారంతో ఎస్వోటీ పోలీసులు మంగళవారం తయారు కేంద్రాన్ని తనిఖీ చేశారు. 500 గ్రాములు కలిగిన వివిధ సింథటిక్ రంగు డబ్బాలు7, 34 చెకోడీ పొట్లాలను, కిలో బరువు కలిగిన 6 మిక్చర్ పొట్లాలు, నలుపురంగులో ఉన్న 5 కిలోల నూనె స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. తయారీదారుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షూటింగ్‌ల అడ్డాగా.. దండుమల్కాపురం

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే:



చుట్టూ ఎత్తైన కొండలు..ఆహ్లాదకరమైన ప్రాంతం.. రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటంతో సినిమాల చిత్రీకరణలకు కేరాఫ్‌గా మారింది దండుమల్కాపురం. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఈ గ్రామం శివారులో పలువురు అగ్ర హీరోల సినిమాలను చిత్రీకరించారు. ఎక్కువగా ఇక్కడ అగ్ర హీరోల సినిమాల్లోని క్లైమాక్స్ ఫైటింగ్ సన్నివేశాలనే చిత్రీకరించారు. ప్రస్తుతం హీరో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న సినిమా చిత్రీకరణ కూడా ఇదే గ్రామంలో జరుగుతుంది. నెల రోజుల క్రితమే ఇక్కడ వేసిన రాజస్థాన్ పల్లెటూరు సెట్టింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే హీరో బాలకృష్ణ, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్‌పై పలు కీలక సన్నివేశాలను దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ) తెరకెక్కించారు. మరికొన్ని రోజుల పాటు ఇక్కడ సినిమా చిత్రీకరణ జరుగనున్నట్టు షూటింగ్ సిబ్బంది పేర్కొన్నారు.

గబ్బర్ సింగ్ సినిమాతో మొదలు..


గబ్బర్‌సింగ్ సినిమాలో స్కార్పియోలతో ఫైటింగ్ సన్నివేశం చిత్రీకరణ

దండుమల్కాపురంలో తొలుత పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్' సినిమా క్లైమాక్స్ ఫైటింగ్‌ను చిత్రీకరించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్కార్పియో వాహనాలతో తీసిన ఛేజింగ్ ఫైటింగ్ సన్నివేశం సినిమాలో హైలెట్‌గా నిలిచింది. ఇదే సినిమాలో ఓ పాటలో సన్నివేశం కూడా ఉంది. దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో హీరో ప్రభాస్ నటించిన 'రెబల్' సినిమా చిత్రీకరణ కూడా ఇక్కడే జరిగింది. హెలికాప్టర్‌లో ప్రభాస్ రావడం, హీరో, విలన్ మధ్య ఫైటింగ్ చేసే సన్నివేశాలను ఇక్కడే తీశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో హీరో మహేశ్‌బాబు నటించిన 'ఆగడు' సినిమా కూడా జరిగింది. సుకుమార్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన 'నాన్నకు ప్రేమతో' సినిమా షూటింగ్ కూడా ఇక్కడే తీశారు. సినిమాలో విలన్ జగపతిబాబు వ్యాపారంలో భాగంగా నిర్మించే గ్యాస్ ప్లాంట్ సెట్టింగ్‌ను వేసి.. హీరో, విలన్, హీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్‌పై పలు సన్నివేశాలను తీశారు. సినిమాలో వచ్చే ఫైటింగ్‌లలో, పాటలో కూడా పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా షూటింగ్‌లు జరిగిన ప్రాంతాలు ఇప్పుడు పారిశ్రామిక పార్కులో కలిసిపోయాయి. ఇప్పుడు పారిశ్రామిక పార్కు ఎదురుగానే బాలకృష్ణ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. గుణశేఖర్ దర్శకత్వంలో హీరోలు అల్లు అర్జున్, రానా దగ్గుబాటి, హీరోయిన్ అనుష్క నటించిన 'రుద్రమదేవి' సినిమా, సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో హీరో చిరంజీవి నటించిన 151వ సినిమా 'సైరా నరసింహారెడ్డి' సినిమాలు దండుమల్కాపురం రెవెన్యూ పరిధిలోని మైలారం రోడ్డులోని గుట్టల్లోనే చిత్రీకరించారు. ఈ సినిమాల కోసం భారీ సెట్టింగ్‌లను వేశారు.

రాగి తీగ చోరీ చేస్తున్న ముఠాకు రిమాండ్

కోదాడ, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కట్ట మీద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికల్లోని రాగి తీగలను చోరీ చేయడమే లక్ష్యంగా ఐదుగురు వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను ఎట్టకేలకు మునగాల పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

❍ నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచెం కోటేశ్, రూపాని గోపి, రూపాని నాగయ్య, పరికుప్పల శ్రీను, కుంచెం విజయ్‌లు ఐదుగురు ఒక ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా కాపర్ వైర్లను దొంగిలించి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వపైన మునగాల పరిధిలోని ఆర్-9 లిఫ్ట్, కలకోవ రైతు రక్షణ కమిటీ ఎత్తిపోతల పథకం లిఫ్టలకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికలోని కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. లిఫ్టు నిర్వాహకులు మునగాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కాపర్ తీగను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

❍ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొద్దులచెరువు సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాల మీద ఐదుగురు నిందితులు వెళ్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ కేసుతో పాటు నడిగూడెం, పెన్‌పహాడ్ పోలీసు స్టేషన్ల పరిధితో పాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో కాపర్ తీగను దొంగలించినట్లు ఒప్పుకొన్నారు. నిందితుల దగ్గరి నుంచి సుమారు రూ.3.60 లక్షలు విలువ చేసే 2.20 క్వింటాళ్ల కాపర్ తీగను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకొని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై గతంలో ఒక్కొక్కరిపై సుమారు ఐదు కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో పురోగతి సాధించిన సిబ్బందిని ఆయన అభినందించి రివార్డు అందించారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

భూమి మార్పిడి కేసులో ఆపరేటర్‌కు బెయిల్

★ తహసీల్దార్ జయశ్రీకి దక్కని ఊరట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి అక్రమంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతుబంధు నిధుల దుర్వినియోగం కేసులో ఏ-2 ముద్దాయిగా అరెస్టయిన ధరణి ఆపరేటర్ జగదీశ్‌కు హుజూర్‌నగర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తు, ఇద్దరు వ్యక్తుల జామీను, ప్రతి శనివారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు హాజరై సంతకం చేయాలన్న నిబంధనలతో బెయిల్ మంజూరైంది. బెయిల్ మంజూరు కావడంతో జగదీశ్‌ను సబ్ జైలు నుంచి విడుదల చేశారు. ఏ-1 ముద్దాయిగా ఉన్న గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీకి బెయిల్ మంజూరు కాకపోవడంతో ఆమె హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. విచారణ ఈనెల 25కు వాయిదా పడింది.

హత్య కేసులో జీవితఖైదు, జరిమానా

హాలియా, న్యూస్‌టుడే: ఒకరిని హత్యచేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావటంతో అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల చినవెంకటరెడ్డికి జీవితఖైదు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ మంగళవారం మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.వేణు తీర్పు ఇచ్చారు. హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జూన్ 12న అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల పెద్ద వెంకటరెడ్డి తన పొలంలో చనిపోయి ఉన్నాడని అతడి భార్య అలుగుల కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పుడు విధుల్లో ఉన్న హాలియా ఎస్సై బీ.సతీష్ కేసు నమోదు చేయగా.. నాటి సీఐ కే.ధనుంజయ్ కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడు హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శిక్షను విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముషంపల్లి గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్‌రెడ్డి(40) తన వ్యవసాయ భూమిలో మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. శ్రీనివాస్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో సాగుకు సంబంధించిన పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ వైరు కాలుకి తగిలి కింద పడిపోయారు. గమనించిన స్థానికులు నల్గొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: పోలీసు, ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు గుంతలు పడిన ప్రదేశాలను గుర్తించి 15 రోజుల్లో మరమ్మతులు చేయాలని, మలుపుల వద్ద ముళ్లపొదలు, చెట్లకొమ్మలను తొలగించాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ.. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో ప్రజాప్రతినిధులు, సబ్‌ఇన్‌స్పెక్టర్ల సహకారంతో వేగ నియంత్రికలు, లైట్లు, స్టాపర్స్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనపు ఎస్పీ, డీఎస్పీలతో పలు మండలాలను దత్తత తీసుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్టీఓ లావణ్య, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బైఠాయింపు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. కొందరు విద్యార్థులు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పడిదల జీడయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మారడం లేదన్నారు. ఉపకార వేతనాలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వివరించారు. వసతి గృహ విద్యార్థులకు మెస్ ఛార్జీలను నెలకు రూ.1500 నుంచి 3 వేలకు పెంచాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆయితగోని జనార్దన్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కర్నాటి యాదగిరి, నాగేశ్వర్‌రావు, సాయికుమార్, మహేశ్, స్వామి, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు



చెట్టు నీడ.. కబుర్ల జాడ

నకిరేకల్ మండలం నోముల గ్రామంలోని తపాలా కార్యాలయం ముందున్న వేపచెట్టుకు దిమ్మెను నిర్మించి రచ్చబండగా తీర్చిదిద్దారు. వివిధ పనులు, పింఛన్ల కోసం ఈ కార్యాలయానికి వచ్చే గ్రామస్థులు, ఇరుగు పొరుగువారు, రహదారి నుంచి అటుగా వెళ్తున్నవారు.. ఇక్కడ కూర్చుని సేదదీరుతుంటారు. మంగళవారం ఇలా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న వారిని 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది.

- నకిరేకల్, న్యూస్‌టుడే





ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండలో హౌసింగ్ బోర్డు కాలనీ బైపాస్ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. గిరికబాలిగూడెం నుంచి హౌసింగ్‌బోర్డుకాలనీ వరకు సుమారు 5 కి.మీ. మేర వేగ నియంత్రణ చర్యలు లేకపోవడం, రోడ్డు మార్గంలో వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో వాహన ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. వారంలోనే వరుసగా మూడు వాహన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మర్రిగూడెంకు చెందిన తాపీ మేస్త్రీ, ఏపీకి చెందిన సెంట్రింగ్ మేస్త్రీలు రోడ్డు ప్రమాదంలో కాళ్లు చేతులు విరిగాయి. మంగళవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో హౌసింగ్‌బోర్డు కాలనీ పట్టణ ప్రకృతి వనం ఎదురుగా పాతబస్తీకి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. ఉదయం 7 గంటల సమయంలో అదే కాలనీ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో బుద్ధారానికి చెందిన పాల వ్యాపారి రాకేష్ కాలనీకి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రెండు వాహనాలు దెబ్బతిన్నాయి.

నియంత్రణ ఏదీ..!

పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పోలీసు నియంత్రణ చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. రోడ్లపై సూచిక బోర్డులు, జీబ్రా గుర్తులు లేకపోవడం, వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు వేగంగా వస్తున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీ కూడలి, గుండ్లపల్లి చౌరస్తా, గిరికబాలిగూడెం ప్రాంతాల్లో విచ్చలవిడిగా రోడ్ల పక్కనే బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాహనదారులు పగలు,రాత్రి తేడా లేకుండా మందు తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు గస్తీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

మాజీ ఎంఈవోకి సన్మానం... చిట్యాల: ఆరేళ్లుగా మండల విద్యాధికారిగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన కూకట్ల నరసింహను చిట్యాలలో మంగళవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సుధాకర్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి పి.సైదా నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కంది మల్ల కృష్ణారెడ్డి, భిక్షపతి, సైదులు, శ్రీనివాస్, శరత్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని ముషంపల్లి రోడ్డు సాయినగర్ ప్రాంతంలో మురుగు కాల్వలు పేరుకుపోయాయి. కాల్వల నుంచి దుర్వాసన వస్తోంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. – లలిత, నల్గొండ.

✓ పరిశీలించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. – శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నల్గొండ పురపాలిక.

ఎన్నాళ్లు ఇలా.. ఇరుకుగా..!



నకిరేకల్: ఒక్క భవనంలో నిర్వహిస్తున్న పీఆర్ డీఈఈ కార్యాలయం, ఎమ్మార్సీ, పశువైద్యశాల నిర్వహణ

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇరుకుగదుల్లో మగ్గుతున్నాయి. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. మండల పరిషత్ కాంప్లెక్స్‌లో ఉన్న పీఆర్ డీఈఈ, ఎమ్మార్సీ, పశువైద్యశాల, విద్యుత్ ప్యూజ్‌ఆఫ్‌కాల్, పీఆర్ అతిథి గృహాలను సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయంలో కూల్చివేశారు. వీటిని సమీపంలోని ప్రభుత్వ భవనాల్లో సర్దుబాటు చేశారు. దీంతో రెండేళ్ల నుంచి అరకొర వసతులు, ఇరుకు గదుల్లోనే వీటి నిర్వహణ కొనసాగుతోంది. వంద పడకల వైద్యశాల నిర్మాణం కోసం తొలగించిన తహసీల్ కార్యాలయాన్ని మార్కెట్ యార్డు భవనాల్లో అసౌకర్యాల మధ్యనే నిర్వహిస్తున్నారు. నకిరేకల్ పుర పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గత రెవిన్యూ చట్టాల్లోని లొసుగుల ఆధారంగా పట్టాలు, రిజిస్ట్రేషన్లు సృష్టించి ప్రైవేట్ నిర్మాణాలు చేపడుతున్నారు. వరద నీటి కాల్వలు, మురుగు కాల్వలను కూడా వదలకుండా ఆక్రమించి పూడ్చివేస్తున్నారు.

★ తమ కార్యాలయానికి సొంత భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయని, స్థల సేకరణ చేపట్టాల్సి ఉందని పీఆర్ డీఈఈ జి.కొండయ్య తెలిపారు.

నాణ్యమైన పత్తిని తీసుకురావాలి: ఆర్డీవో

నకిరేకల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని నల్గొండ ఆర్డీవో వి.శ్రీదేవి కోరారు. నకిరేకల్ శివారులోని వెంకటకృష్ణ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. 8 నుంచి 12 శాతానికి లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారి ప్రణవ్ ఆర్డీవోకు వివరించారు. ప్రస్తుతం ఇక్కడ 25 శాతం తేమ ఉన్న పత్తి వస్తున్నందున ఇంకా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లను మొదలుపెట్టలేదన్నారు. తహసీల్దారు జమీరోద్దీన్, మార్కెటింగ్ శాఖ అధికారి కిషన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నకిరేకల్: పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న నల్గొండ ఆర్డీవో శ్రీదేవి, సీసీఐ, మార్కెటింగ్ అధికారులు

స్థల పరిశీలన... నల్గొండ గ్రామీణం: నల్గొండ మండలం అప్పాజీపేటలో బీసీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణం కోసం నల్గొండ ఆర్డీవో శ్రీదేవి స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని శివారు బంటుగూడలో 7 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా ఇందులో రెండు ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఈ స్థలం ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందనే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతానికి బీసీ బాలికల గురుకుల పాఠశాలను నల్గొండలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. మాజీ సర్పంచి పబ్బతిరెడ్డి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కట్టంగూరు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. మంగళవారం పరడ, నారెగూడెం, ఈదులూరు, మునుకుంట్ల, కల్మెర, ముత్యాలమ్మగూడెం, ఎరసానిగూడెం, బొల్లేపల్లి గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడుకు రూ.2,320 సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ప్రకాశ్‌రావు, నర్సింహా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుక్కయ్య పాల్గొన్నారు.



పరడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మునుగోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచి జాల వెంకన్నయాదవ్ అన్నారు. కొంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో యాదగిరి, రైతులు మక్కెన అప్పారావు, ఎడ్ల రామలింగయ్య, మొగుదాల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వంగూరు నారాయణయాదవ్, ఎస్.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్గొండలోని యాదవసంఘం భవన్‌లో మంగళవారం సాయంత్రం టీయూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో మూడింటిని అయినా విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ఎల్లయ్య, కె.కృష్ణయ్య, కోట మల్లయ్య, రామదాసు, సత్యనారాయణ, శ్రీనివాస్, రామలింగయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగూరు నారాయణ యాదవ్, ఎస్.వెంకటేశ్వరరావు, నాయకులు

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** .విశ్వం, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ-** విశ్వం, **వెంకటేశ్వర-** దేవర

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: రెడ్ రిబ్బన్‌యూత్ ఫెస్ట్ వారు హైదరాబాద్‌లో ఎయిడ్స్ నిర్మూలనపై నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో నల్గొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల డీవీకేరోడ్ విద్యార్థులు సిహెచ్.అవినాష్ (10వ తరగతి), కె.విశాల్ (10వ తరగతి)లు ద్వితీయ బహుమతి సాధించారు. విద్యార్థులకు మెమెంటో, ప్రశంసాపత్రం, 8వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు సిహెచ్.అవినాష్, కె.విశాల్‌లను డీఈవో భిక్షపతి, హెచ్ఎం యూసుఫుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న నల్గొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సిహెచ్.అవినాష్, కె.విశాల్

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్

నాంపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలపరిధిలోని మేళ్లవాయిలో నిర్వహించిన పస్నూరు, మేళ్లవాయి గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, నియోజకవర్గానికి 5 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రైతుబంధు పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, కె.లక్ష్మయ్య, వి.ముత్తిలింగం, కె.ముకేశ్, పర్వతాలు, రాములు, ఎల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి: మేళ్లవాయిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నార్కట్‌పల్లి గ్రామీణం: పదేళ్లుగా దేశాభివృద్ధి కోసం భాజపా ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లి మండలంలోని యల్లారెడ్డిగూడెం గ్రామ శాఖ 15వ మహాసభ దండు రవి అధ్యక్షతన మంగళవారం జరిగింది. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 370 రోజులు దిల్లీలో ధర్నా నిర్వహించి విజయం సాధించారని గుర్తుచేశారు. జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పెద్దులు, మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి, బయన్న, సైదులు, శంకరయ్య పాల్గొన్నారు.

గట్టుప్పల: మండల కేంద్రంలో ఈనెల 24న నిర్వహించే సీపీఎం ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి మల్లేశం మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

రుణమాఫీ చేయాలి: ప్రమీల... కేతేపల్లి: రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. కేతేపల్లిలోని అమరవీరుల స్మారక భవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. వానాకాలం, యాసంగి పంట సీజన్‌లకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల పంట పెట్టుబడి సాయం అందించాలన్నారు. దొడ్డురకం ధాన్యానికి కూడా రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని పేర్కొనారు. సీపీఎం మండల కార్యదర్శి లూర్దుమారయ్య అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు చినవెంకులు, లింగయ్య, వెంకన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయులపై విచారణ జరపాలి: డీటీఎఫ్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖలో జూన్-2024లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో స్పౌజ్ వాడుకున్న ఉపాధ్యాయులందరిపై విచారణ జరపాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. చాలామంది స్పౌజ్‌ను వాడుకుని బదిలీ అయ్యారని ఆ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.ఖుర్షిద్‌మియా, ప్రధాన కార్యదర్శి పి.వెంకులు ఆరోపించారు. కావాలనే దగ్గరి ప్రాంతాలకు ఎంపిక ఇవ్వకుండా నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ తదితర పట్టణాలకు బదిలీ అయ్యారని తెలిపారు. స్పౌజ్‌ను వాడుకున్న ఉపాధ్యాయులపై విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను, విద్యాశాఖాధికారిని డిమాండ్ చేశారు.

విధుల్లో చేరిన 20 రోజులకే కండక్టర్ ఆత్మహత్య

కనగల్, న్యూస్‌టుడే: ఉద్యోగంలో చేరిన 20 రోజులకే అందులో ఇమడలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని జి.యడవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పి.విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలకంఠం వెంకటేశం యాదగిరిగుట్ట బస్‌డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని తన కుమారుడు చక్రవర్తి(26)కి ఉద్యోగం ఇప్పించారు. ప్రారంభంలో విధి నిర్వహణలో ఇబ్బందులకు గురైన చక్రవర్తి సోమవారం సాయంత్రం వారి వ్యవసాయ పొలం వద్ద శీతల పానియంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు



నీలకంఠం చక్రవర్తి

జాతీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుంచి 22 వరకు పరిశోధనల పద్ధతులపై నిర్వహించే జాతీయ శిక్షణ తరగతుల కరపత్రం వర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్ మంగళవారం ఆవిష్కరించారు. నైపుణ్యాల పెంపుతోనే నాణ్యమైన పరిశోధనలు జరుగుతాయని తెలిపారు. దేశంలోని యూజీసీ గుర్తింపు పొందిన సంస్థల్లో యువ అధ్యాపకులు, పరిశోధకులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, మిర్యాల రమేశ్, సరిత, వెంకటరమణారెడ్డి, సురేశ్‌రెడ్డి, ప్రవళిక, లక్ష్మీప్రభ, సబీనా హెరాల్డ్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ సేవలు: ఆర్ఎం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా సమష్టి కృషితో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించి.. రాష్ట్రంలోనే అత్యధికంగా ఓఆర్ సాధించనందుకు సంస్థ ఉద్యోగులకు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ అభినందనలు తెలిపారు. నల్గొండ రీజియన్‌లో ఉద్యోగులు కష్టపడి ఆదాయాన్ని సమకూర్చినందుకు గాను ప్రోత్సాహకంగా ఉద్యోగులకు మంగళవారం నల్గొండ డిపోలో బహుమతులు అందజేశారు. దీపావళి, శుభకార్యాలు ఉన్నందున ఇదే స్ఫూర్తి కొనసాగించి ఆదర్శ రీజియన్‌గా కొనసాగాలని కోరారు. డిప్యూటీ ఆర్ఎంలు మాధవి, శివశంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అమృత్‌సర్‌లో నవంబరు 6 నుంచి నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీల్లో పాల్గొనే ఎంజీయూ బాలబాలికల క్రీడాకారులను మంగళవారం వర్సిటీ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని.. మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు పొందవచ్చని తెలిపారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, హరీశ్‌కుమార్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటు యోచన విరమించుకోవాలి

చిట్యాల, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్‌చేశారు. చిట్యాలలో మంగళవారం నిర్వహించిన తమ పార్టీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కాలుష్య కారకమైన, ప్రజలకు ఇబ్బంది కలిగే పరిశ్రమలకు అనుమతించకూడదని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, ఎస్కే షరీఫ్, దేశగోని బాలరాజు, లింగయ్య, బాల్‌రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వరి పంటలను పరిశీలించిన ఏడీఏ... మర్రిగూడ: కోతకు వచ్చిన వరి పంటకు తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ వేణుగోపాల్ అన్నదాతలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వరి పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. కోత సమయంలో తెగుళ్లు రాకుండా తగిన మోతాదులో మందులు పిచికారి చేసి పంటను కాపాడుకోవాలని తెలిపారు. రైతులు వాడుతున్న మందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, రైతులు రాజేంద్ర కుమార్, పానగంటి రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భాజపాకు ఆదరణ: యానాల... నకిరేకల్: ప్రధాని నరేంద్రమోదీకి, భాజపాకు క్షేత్రస్థాయిలో ఆదరణ ఉందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యానాల శంకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని నోముల గ్రామంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా సాయం అందించకుండా, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు యానాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి సైదులు, ఉప్పల నాగరాజు, పెద్దులు, బాదిని యాదయ్య, నాగేందర్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ... నల్గొండ టౌన్: నల్గొండ పట్టణం కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గురుకుల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల విద్యాలయాలు నిర్వహించే పోటీ పరీక్షల్లో రాణించాలనే లక్ష్యంతో ఈ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హెచ్ఎం విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు చాంద్‌బీ, రాజశేఖర్, రాణి, ఆరోగ్యమ్మ, శైలజ, మధుబాబు పాల్గొన్నారు.



మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ... నల్గొండ విద్యావిభాగం: రామానుజన్ మ్యాథమెటిక్స్ అకాడమీ రామచంద్రాపురం వారు నిర్వహించే ప్రతిష్ఠాత్మక రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో నల్గొండలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు ఫస్ట్ లెవల్‌లో ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఛైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం వాణి పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ గోడపత్రిక ఆవిష్కరణ... నీలగిరి: పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే మహోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి ఇందూరు సాగర్ కోరారు. మంగళవారం పట్టణంలో సంబంధిత గోడపత్రికను ఆవిష్కరించారు. నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజు, సుధా, మహేశ్, బాలు, వెంకట్, మాధవ్, సాత్విక్ పాల్గొన్నారు.

14వ తేదీ వరకు గాలికుంట్ల నివారణ టీకాలు... మర్రిగూడ: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని పాడి రైతుల పశువులకు గాలికుంట్ల నివారణ మందుల కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటి వరకు సుమారు 800 వందలకు పేగా టీకాలు వేసినట్టు పశువైద్యాధికారులు డాక్టర్ సురేందర్, యమునలు తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

వేతనాలు అమలుచేయాలని వినతి... చిట్యాల: పుర పరిధిలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులకు కనీస వేతనాలను రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ అధికారులను డిమాండ్ చేశారు. చిట్యాల పుర కమిషనర్ పి.వీరేందర్‌ను కార్మికులతో కలిసి మంగళవారం ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జడల నరసింహ, పాల లక్ష్మయ్య, పాల యమున, వరలక్ష్మి, నరసింహ పాల్గొన్నారు.

కుమురం భీం జయంతి... మర్రిగూడ: ఆదివాసుల హక్కుల్లకై ఆనాటి నిజాం ప్రభుత్వంతో వీరోచిత పోరాటం చేసిన కుమురం భీం ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యావనరుల భవనంలో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొమురం భీం జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై నివాళి అర్పించారు. లచ్చిరాం, వెంకటకృష్ణ, శ్రీరాం, విటల్, రమేశ్, తిరుపతి, సైదులు, రహీం పాల్గొన్నారు.

గంజాయి దహనం

భువనగిరి నేరవిభాగం: ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన గంజాయిని భువనగిరి శివారులోని రోమా ఇండస్ట్రీస్‌లో దహనం చేశారు. నల్గొండ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 25 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ అనుమతితో దహనం ప్రక్రియ చేపట్టినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి 144 కిలోలు, గంజాయి చాక్లెట్లు 4.5 కిలోలు హాష్ అయిల్ 40 ఎం.ఎల్ కాల్చివేశామని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారులు బి.సంతోష్, ఎస్.సైదులు, ఆర్. లక్ష్మానాయక్, నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.



పిట్టంపల్లికి వెళ్లే దారిలో చంద్రగిరి విల్లాస్ కాలనీ వద్ద పరిస్థితి

మంత్రి చెప్పినా.. తట్ట మట్టి పోయలే

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ప్రధాన రహదారి నుంచి చంద్రగిరి విల్లాస్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఈనెల 3న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీవాసుల సమస్యలు ప్రత్యక్షంగా చూసిన మంత్రి మున్సిపాలిటీ నిధులు రూ.75 లక్షలతో వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులతో పాటు గుత్తేదారులను ఆదేశించారు. 12 ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు మోక్షం లభించిందని చంద్రగిరి విల్లాస్ కాలనీతో పాటు వినాయక్‌నగర్, ఓసీటీఎల్ కాలనీ, చర్లపల్లి ప్రాంతానికి చెందిన వారు సంతోషించారు. ప్రధాన రోడ్డు నుంచి చంద్రగిరి విల్లాస్‌కాలనీ వరకు రోడ్డుపై అడుగులోతు ఉన్న 160 గుంతల్లో ఒక్క తట్ట మట్టికూడా పోయకపోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం వచ్చిన వర్షంలో రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో పడిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలు పాలవడంతో జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులు, గుత్తేదారులు స్పందించి రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

గురుకులాల్లో జిల్లా స్థాయి క్రీడాపోటీలు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలోని దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకులాల సొసైటీలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడాపోటీలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 14 పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రీడాపోటీలు ప్రతిభ చాటిన విద్యార్థినులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఇప్పటికే మైదానం, వసతులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

జయప్రదం చేయండి

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలో నవంబర్ 3న నిర్వహించనున్న బీసీల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
77994 92939
99121 74975
98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని సీతారాంపురం గీతామందిర్, టాకా రోడ్డు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక అనేక ఇబ్బందులు పడుతున్నాం. – తల్లం అశోక్, మిర్యాలగూడ

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

రైతులను ఆదుకోవాలి



నేలవాలిన పంట పొలాలను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శెట్టిపాలెంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నేలవాలిన పంట పొలాలను మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పరిశీలించి మాట్లాడారు. కోతకు వచ్చే పొలాలు వేల ఎకరాలలో నేలపడినా.. తరచూ వర్షాలు రావడంతో పంట నీట మునిగి వడ్లు మొలకెత్తుతున్నాయన్నారు. ఎకరానికి రూ.30 వేల పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శశిధర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర పొందండి

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ డివిజన్ పరిధిలోని రైతులు పత్తి పంట విక్రయించుకునేందుకు వీలుగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండలంలో 4 కేంద్రాలు, పీఏపల్లిలో 3, కొండమల్లేపల్లిలో 1, డిండిలో 1, గుర్రంపోడ్‌లో 1 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తమ పత్తి పంటను ఈ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని తెలిపారు.

ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: పత్తి రైతులు ఇప్పటికే వర్షాల కారణంగా పూర్తిగా పంటలు నష్టపోయిన నేపథ్యంలో తేమశాతం పేరుతో సీసీఐ కొనుగోలు కేంద్రాలు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ప్రజాసంఘాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వెంకటరమణ, ఎం.డి.మైనుద్దీన్, బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, బి.సైలేష్, రామస్వామి, ఆంజనేయులు ఉన్నారు.

నిరుపయోగంగా హిల్‌కాలనీ బస్టాండ్



రేకులషెడ్‌లో హిల్‌కాలనీ బస్టాండ్

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బస్టాండ్ ప్రయాణికులకు నిరుపయోగంగా మారింది. సాగర్ డ్యాం నిర్మాణ సమయంలో ఇక్కడికి వచ్చే ప్రయాణికులకు, పర్యాటకులకు ఉపయోగపడే విధంగా ఎన్నెస్పీ అధికారులు తాత్కాలికంగా రేకుల షెడ్డులో బస్టాండును ఏర్పాటుచేయగా.. దాన్నే ఇప్పటికీ వాడుతున్నారు. సుమారు 70 ఏళ్ల కాలంలో సాగర్ కాలనీ, ఇతర పనుల నిర్వహణకు ప్రభుత్వం కొన్ని రూ.కోట్లు ఖర్చు చేసింది కానీ దీన్ని మాత్రం ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇక్కడ ప్రయాణికులకు కనీసం కూర్చోవడానికి బల్లలు, మరుగుదొడ్ల వసతి లాంటి కనీస సౌకర్యాలు కరవయ్యాయి. బస్టాండ్‌కు మరమ్మతులు చేసి ప్రయాణికులకు, పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై నందికొండ పుర కమిషనర్ శ్రీను మాట్లాడుతూ.. బస్టాండ్‌కు చేయాల్సిన మరమ్మతులు మున్సిపాలిటీ పరిధిలో లేవు.. అయినా పురపాలక సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



వృథాగా ఉన్న మరుగుదొడ్లు

పైకప్పు లీకేజీ..!



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండు



పైకప్పు నుంచి వర్షం నీరు లీకవుతున్న తీరు

సుమారు 30 ఏళ్ల క్రితం కేసీఆర్ రవాణాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండు ప్రస్తుతం పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం నీరు లీకవుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పైకప్పు నుంచి వర్షం నీరు కిందకు కారి ప్రయాణికులపై పడుతుండగా బస్టాండులో నిల్చున్న వారి వస్తువులు, దుస్తులు తడుస్తున్నాయి. నిత్యం వందలాది మందితో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండులో లీకేజీలను మరమ్మతులు చేయించి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మిర్యాలగూడ

సమానంగా పరిగణించాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల



కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గోడ పత్రికల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షులు కొమిరె సైదులు, ప్రధాన కార్యదర్శి బద్దెల అంజయ్య, నాయకులు రమావత్ నాగేశ్వరరావు, సరస్వతి, ఆంజనేయులు, శ్రీధర్, జనార్థన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, నీరజ, అనురాధ, నజీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన ..



చింతపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి: ఉపాధ్యాయుల సమస్యలైన డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తపస్ మండల అధ్యక్షుడు సొనగంటి వేణుగోపాల్ ప్రధాన కార్యదర్శి శివకోటి కిరణ్‌కుమార్ మాట్లాడారు. పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వినోద్, నెలంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: బాలునాయక్



చిన్నఅడిశర్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. మంగళవారం చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేవరకొండ మున్సిపల్ ఛైర్మన్ నర్సింహ, సహకార సంఘం ఛైర్మన్ డా.వేణుధర్‌రెడ్డి, మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జానియాదవ్, వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బాలునాయక్ సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో అంగడిపేట స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. పార్లమెంటు కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, ఏఎంసీ ఛైర్మన్ ఎన్.జమున, పీఏసీఎస్ ఛైర్మన్ మణిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వి.యల్లయ్య యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ: డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, నేరెడుగొమ్ము మండలాల 116 మంది కల్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్ చెక్కులు పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. 224 మందికి మంజూరైన రూ.52లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పురపాలిక సంఘం ఛైర్మన్ నర్సింహ, సీపీఐ రాష్ట్ర నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ జాన్, వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి: ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తిచేసి రైతాంగానికి అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. ఆయన పీఏపల్లిలో కొనసాగుతున్న ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ఎత్తిపోతల పథకం పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి చిలకమర్రి స్టేజీ వరకు ప్రధాన పైపులైన్ పూర్తిచేసి ఆగస్టు నాటికి రైతుల భూములకు సాగునీటిని అందించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారన్నారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన పెద్దగట్టు, పెద్దమునిగల్ అంబాభవాని, కంభాలపల్లి, పొగిళ్ల ఎత్తిపోతల పథకాలను పూర్తికి అటవీశాఖ అనుమతులు తీసుకువచ్చి మూడేళ్లలో పూర్తిచేస్తామన్నారు. వీటితో పాటు నూతనంగా ప్రతిపాదించిన గాజుబెడం, నేరెడుగొమ్ము, నక్కలగండి నుంచి చిత్రియాల పథకాలకు సర్వే చేయించి మంజూరు చేయించనున్నామన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వి.యల్లయ్య, మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ జీజేవీ సత్యనారాయణ, డీఈ నాగయ్య, ఏఈలు శ్రావణ్, శిల్ప పాల్గొన్నారు.

మధ్యంతర ఉత్తర్వులతో... దారిపై గోడ తొలగింపు



పొక్లెయిన్‌తో గోడను తొలగింపజేస్తున్న అధికారులు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జేత్యాతండా గ్రామపంచాయతీలో ఎస్టీ, బీసీ కాలనీల మధ్య కొందరు అంతర్గత చిచ్చు పెట్టడం కారణంగా అది రెండు కాలనీల మధ్య గొడవకు దారి తీసింది. దీంతో ఎస్టీ కాలనీ వాసులు బీసీ కాలనీకి వెళ్లే దారిలో ఈ ఏడాది జులై రెండో వారంలో గోడ కట్టారు. ఈ విషయమై కాలనీ వాసులు ఈ ఏడాది ఆగస్టు రెండో వారంలో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈనెల 30వ తేదీలోపు గోడను తొలగించాలని మంగళవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ గోడ తొలగించేందుకు మంగళవారం ఉదయం డీఎల్‌పీవో రాఘవరావు, ఎంపీడీవో శేషగిరి శర్మ, తహసీల్దారు హరిబాబు, సీఐ వీరబాబు, ఎస్సై లోకేష్‌కుమార్, కానిస్టేబళ్లను పంపారు. అధికారులు ఉదయం 11 గంటలకు వెళ్లగా తండా వాసులు గోడ తొలగించకుండా అడ్డుపడ్డారు. చివరికి సాయంత్రం ఐదు గంటల సమయంలో గోడను తొలగించారు.

అక్రమ నిర్మాణాలు.. మండల పరిధిలోని అవంతీపురం గ్రామంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని సబ్ కలెక్టరు నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, ఎన్‌ఎస్‌పీ, రెవెన్యూ అధికారుల బృందం మంగళవారం తొలగించారు. తహసీల్దార్ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ-జడ్చర్ల రహదారిపై కొందరు కట్టడాలు నిర్మించారని ఫిర్యాదు మేరకు సర్వే చేసి తొలగించినట్లు తెలిపారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక

కనిపెంచిన తల్లిని.. తరిమి కొట్టారు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నవ మాసాలు మోసి.. కని పెంచి.. కంటికి రెప్పలా కాపాడుకుని పెద్ద వారిని చేసిన తల్లిని రోడ్డున పడేశారు ఆ కుమారులు. కుమారులు చేసిన పనికి కుంగిపోయిన ఆ తల్లి అధికారులకు మొరపెట్టుకుని.. విలపించింది. వివరాల్లోకి వెళ్తే.. దామరచర్ల మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు. కుమారులకు పదేళ్ల వయసున్నప్పుడే భర్త మరణించడంతో ఎన్నో కష్టాలు పడి పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసింది. వృద్ధాప్యంలో ఉన్న లక్ష్మమ్మకు పక్షవాతంతో కాలు, చెయ్యి పడిపోవడంతో ఆసుపత్రిలో చేర్పించారు కుమారులు. ఆ తర్వాత పెద్ద కుమారుడి వద్దకు చేరుకున్న ఆమెను 4 నెలల పాటు సాకిన తర్వాత.. చిన్న కుమారుడి వద్దకు వెళ్లాలని పంపించారు. చిన్న కుమారుడు తల్లిని రాకుండా అడ్డుకుని తిరిగి అన్న వద్దకు పంపించారు. వారు సైతం నిరాకరించడంతో గత్యంతరం లేక మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ వద్ద తన బాధ చెప్పుకున్నారు. అనంతరం విలపిస్తూ విలేకరుల వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ లక్ష్మను ఐసీడీఎస్ సిబ్బంది ద్వారా అవంతీపురం గురుసాయి వృద్ధాశ్రమానికి తరలించారు.

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

పెద్దవూర, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తూ అమలు చేయడం ఎంతో సంతోషకరమని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎస్సీ యూత్ అధ్యక్షుడు పరమేష్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈనెల 24న మాదిగల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమానికి మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి హాజరౌతున్నట్లు తెలిపారు. సత్యనారాయణ, విద్యాసాగర్, ఏడుకొండలు పాల్గొన్నారు.

చింతపల్లి: ఈ నెల 24న మాదిగల సమ్మేళనాన్ని దేవరకొండలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం దేవరకొండ నియోజకవర్గ మాదిగ ఐకాస ఇన్‌ఛార్జి చెట్టిపల్లి చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

నేడు ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

చింతపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని ఆ సంఘం మండల ఉపాధ్యక్షుడు ఆరెంకంటి యాదగిరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాలలు ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోఛైర్మన్ తాళ్లపల్లి రవి

దేవరకొండ, న్యూస్‌టుడే: మాలలంతా ఐక్యంగా ఉండి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోఛైర్మన్ తాళ్లపల్లి రవి అన్నారు. మంగళవారం దేవరకొండ ఐబీలో కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నవంబరు 24న హైదరాబాద్‌లో మాలలు నిర్వహించే సభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సత్తా చాటాలని తెలిపారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లకుమల్ల మధుబాబు, గాజుల పున్నమ్మ, చింతపల్లి లింగమయ్య, బాలకృష్ణ, స్వర్ణలత, జోసెఫ్, భూతం అర్జున్, యేకుల సురేష్ తదితరులున్నారు.

అమ్మే అంత్యక్రియలు చేసింది

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నవ మాసాలు మోసి.. కని.. పెంచిన తల్లే కుమారుడికి తలకొరివి పెట్టాల్సిన పరిస్థితి పలువురిని కంట తడి పెట్టించింది. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన ఈ విషాద ఘటన వివరాలివీ.. పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన రేణుగుంట్ల విజయ్(45) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. కుట్టు మిషన్ల మరమ్మతులు చేస్తూ జీవనం సాగించే విజయ్‌కి వివాహం కాక పోవడంతో 85 ఏళ్ల వయసున్న తల్లి రాములమ్మ కలిసి ఉంటున్నాడు. అతడు హఠాన్మరణం చెందడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడం, బంధువులు ఎవరూ ముందుకు రాక పోవడంతో వృద్ధురాలైన తల్లి రాములమ్మ అతి కష్టం మీద కుమారుడి మృతదేహానికి మంగళవారం దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటన చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

అరుదైన పక్షి లభ్యం



పక్షిని చూపుతున్న స్థానికులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని బంగారుగడ్డలో మంగళవారం స్థానికులకు అరుదైన పక్షి లభ్యమైంది. స్థానికులు పక్షి గురించిన వివరాలు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించగా.. వారు వచ్చి ఉత్తరాదిలో సంచరించే అరుదైన ఇండియన్ బ్లూ పక్షిగా గుర్తించారు. స్థానికులు పట్టుకోవడంతో పక్షి ఎగరలేని స్థితికి చేరుకోవటంతో చికిత్స అందించి.. ఎగిరే స్థితికి వచ్చిన తర్వాత మండల పరిధిలోని కాల్వపల్లి రిజర్వ్ ఫారెస్టులో వదిలేసినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

వనస్థలిపురం: నిర్మాణంలోని బహుళ అంతస్తుల భవనంలో పనులు చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ నారమోని జగన్ (27) కొంతకాలంగా భార్య, ఇద్దరు పిల్లలతో సాగర్ కాంప్లెక్స్‌లో ఉంటున్నాడు. నాలుగు రోజులుగా గుర్రంగూడ అటవీ ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్తు పనులు చేస్తున్నాడు. పనులు చేస్తుండగా, మంగళవారం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం,: ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం మిర్యాలగూడలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ సీఐ కోట కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం. . జొన్నపాల ముత్తయ్య(45) పట్టణంలోని ఎస్సీ కన్వెన్షన్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన భార్య లక్ష్మితో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా గత కొద్ది రోజులుగా అప్పులు అధికమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, ఆటో ఢీ.. కూలీలకు గాయాలు

నిడమనూరు: కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో కూలీలకు గాయాలైన ఘటన నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. శాఖాపురం వైపు నుంచి వస్తున్న ఓ కారు మిర్యాలగూడ వైపు వెళ్లడానికి రోడ్డు దాటుతుంది. ఆ సమయంలో త్రిపురారం మండలం పెద్దదేవులపల్లికి చెందిన కూలీలతో హాలియా వైపు వెళ్తున్న ఆటో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

నియామకం



వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ న్యూస్‌టుడే: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మిర్యాలగూడకు చెందిన రాపోలు వెంకటేశ్వర్లును రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియమించారు. ఈ సందర్భంగా రాపోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేనేతల సభ్యత్వాల నమోదును వేగవంతం చేస్తానని తెలిపారు.

మిర్యాలగూడ పట్టణం: చేనేత ఐక్య వేదిక రాష్ట్ర సలహా మండలి ఛైర్మన్‌గా మిర్యాలగూడకు చెందిన కొంగరి లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా జిల్లా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ మంగళవారం తమకు నియామకపత్రాలు అందించినట్లు స్థానికంగా తెలిపారు.

భోజనాలు వడ్డించి.. చిన్నారులతో కలిసి

చింతపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకొని అధ్యయనం చేసేందుకు సివిల్ సర్వీసెస్ (శిక్షణ ఐఏఎస్)అధికారుల బృందం మంగళవారం మండలంలోని జర్పులతండాలో రెండో రోజు పర్యటించారు. డా.మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు గ్రామంలో అధ్యయనం చేపట్టారు. ఐదుగురు సభ్యులతో కూడిన బృందం గ్రామంలో అమలు అవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు భోజనాలు వడ్డించి, చిన్నారులకు వివిధ ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సరిత తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలోని జర్పులతండాలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో శిక్షణ ఐఏఎస్‌లు

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెంలో శిక్షణ ఐఏఎస్‌ల బృందం మంగళవారం పర్యటించింది. స్థానిక అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి బోధనా పద్ధతులు, అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో సాగుచేస్తున్న పండ్లతోటలను పరిశీలించి రైతుల అనుభవాలు సేకరించారు. వీరిలో ఐఏఎస్‌లు పాయల్‌మీన, రష్మీ, అభిషేక్ రంజన్, కునాల్ గురు రాని, అషుతోష్ సాటిలతో పాటు స్థానిక ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో శిక్షణ ఐఏఎస్ అధికారులు మంగళవారం పూజలు నిర్వహించారు. శిక్షణ ఐఏఎస్ అధికారులు దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో కొంతసేపు గడిపారు. ఆలయ పరిసరాలను, దేవాలయంలోని విగ్రహాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

అవీ ఇవీ

కేసు నమోదు.. నాగార్జునసాగర్: ఎన్నెస్పీలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన కొందరి యువకులపై కేసు నమోదైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సాగర్ ఎస్సై సంపత్ తెలిపిన వివరాల మేరకు.. హిల్‌కాలనీ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న చిన్నయ్య ఆదివారం రాత్రి మంచి నీటి ట్యాంకు నింపడానికి వెళ్లిన సమయంలో కెనాల్ కొండపై కొందరు యువకులు మద్యం తాగి ఆయనపై దాడి చేశారు. ఈ మేరకు ఆయన చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదుతో యువకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆందోళన.. మిర్యాలగూడ పట్టణం: పొలానికి పురుగు మందులు అడిగితే నకిలీవి ఇచ్చి.. తమను మోసం చేశారని ఆరోపిస్తూ బాధిత రైతు దామరచర్ల మండలం దిలావర్‌పూర్‌కు చెందిన ధనావత్ శ్రీహరి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మిర్యాలగూడలోని దుకాణం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దుకాణదారుడిని నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆరోపించారు. కాగా రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ఏవో సైదానాయక్ తెలిపారు.

అవాస్తవం.. మిర్యాలగూడ: మిర్యాలగూడలోని సర్వే సంఖ్య 992లో 10గుంటల స్థలం విషయంలో భాగస్వాముల మధ్య వివాదం తలెత్తినట్లు, ఆ భూమి ప్రభుత్వ భూమి అని వస్తున్న ఆరోపణలు అవాస్తవమని పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ భూమి గ్రామకంఠానికి చెందినట్లుగా.. 65 ఏళ్ల తర్వాత బయట పడినట్లు పుకార్లు సృష్టించారన్నారు. ఆ స్థలంలో అద్దెదారుకు అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై మాత్రమే పుర అధికారులు నోటీసులు అందించారన్నారు. ఆ భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ఎటువంటి విచారణకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో మన్నెం లింగారెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు.. మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో గత పదేళ్లకాలంలో ప్రభుత్వ భూముల పక్కన వెంచర్లు ఏర్పాటు చేసి ఆక్రమించుకున్నారని, దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెజ్జం సాయి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి ప్రాంతాల్లో గతంలో వెంచర్లలో ప్రభుత్వ భూములు కలిపివేశారన్నారు. బినామీల పేరుతో ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపిక.. పెద్దఅడిశర్లపల్లి: పెద్దగట్టు మాజీ సర్పంచి దేపావత్ నరేందర్ మహాత్మాగాంధీ శాంతి పురస్కారం సేవారత్న అవార్డు అందుకున్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అందజేసే ఈ అవార్డుకు నరేందర్ గత ఐదు సంవత్సరాలు సర్పంచిగా అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సరస్వత పరిషత్ ఆడిటోరియంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బి.దయానంద్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సుప్రీంకోర్టు అడ్వకేట్ పాండుల సమక్షంలో తనకు అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఇంజిన్ చోరీ.. డిండి: వ్యవసాయ పొలంలో రేకుల షెడ్డులో ఉంచిన ట్రాక్టర్ ఇంజిన్ చోరీకి గురైన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన మెరుగు సంజీవరెడ్డి కందుకూర్ శివారులో వ్యవసాయ భూమి ఉంది. పొలం పనులు పూర్తయిన తర్వాత స్వరాజ్ ట్రాక్టర్‌ను రేకుల షెడ్డులో నిలిపివేశాడు. పని నిమిత్తం మంగళవారం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరిగి వచ్చే వరకు ట్రాక్టర్ చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం.. మిర్యాలగూడ పట్టణం: కార్మికుల నగదు, భూమిని కాజేశారని మిర్యాలగూడ ఎఫ్సీఐ డీపీఎస్ కార్మికులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని నాన్ డీపీఎస్ కార్మికులు విజయ్ శంకర్‌రావు, రామారావు, భిక్షంరెడ్డి, శంకర్, మౌలా అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 500 మంది కార్మికులు సొసైటీగా ఏర్పడి హమాలీ పని చేస్తూ ఉపాధి పొందుతున్న తమపై ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. శంకర్, రవి, చిన్నా, చందర్, బాల, కృష్ణ పాల్గొన్నారు.